# రామవ్వ గారి మనవడు

గోపాలం పరేషాన్‌లో పడ్డాడు. పరేషాన్‌లో పడింది ప్రాసకోసమేం కాదు, బామ్మకోసం. బామ్మ కోరక కోరక కోరిన ఒక్కగానొక్క చిన్న కోరికకోసం.

"ముప్పై ఏండ్లొచ్చినయ్! పెళ్లీ పెటాకుల్లేకుండా ఇంకెన్ని రోజులిట్లా అల్లరిచిల్లరగా తిరుగుతావురా బడుద్దాయి. నీ ఈడొచ్చేసరికి మీ తాతయ్య ముగ్గురు పిల్లల తండ్రయ్యాడు. నీవుఉన్నావెందుకు దండగ." తన స్టామినా అంతా ఊపయోగించి మరీ రామవ్వ గుక్కతిప్పుకోకుండా మనవడికి మసాల మిర్చి నషాళానికంటించినంత పన్జేసింది.

"బామ్మా....!" డిజిటబుల్ సౌండ్ ఎఫెక్టుతో ఓ గావుకేక పెట్టాడు గోపాలం.

పెళ్లి మాటెత్తితే చాలు హైజంప్ చేయడం అలవాటతనికి. ఒలింపిక్ పోటీల్లో నిలబెట్టి పెళ్లి ప్రస్తావన విషయం తెస్తేచాలు... మనవాడికి హైజంప్‌లో ఫస్ట్‌ప్రైజ్ రావడం ఖాయం.

అలా అని పెళ్లంటే అతగాడికేం విముఖత లేదు. పెళ్లి-పెళ్లాం మీద బోల్డన్ని కలలు సప్తవర్ణాల్లో కంటుంటాడు. కాబట్టి ఆ విషయంలో పెద్దగా అనుమానించాల్సిందేం లేదు.

కాకపోతే అరెంజ్డ్ మ్యారెజెస్‌మీద ఎందుకనో అయిష్టత ఏర్పరుచుకున్నాడు.

సినిమాలు, టీవీలు, నవలలు ఎఫెక్టో కాదో తెలీదుగానీ 'లవ్వాడి పెళ్లాడు' అనే స్లోగన్ పట్టుక్కూచున్నాడు.

ఇంట్లో ఎవరు పెళ్లి మాటెత్తినా పెనంమీద గింజలా చిటపటలాడేస్తాడు. బామ్మవంక కొరకొరా చూసేస్తాడు. అయినా పట్టువదలని విక్రమార్కుని పినతల్లిలా బామ్మ మనవడి వెంట పడుతూనే ఉంది.

"అరవరా అరువు. ముసల్దాన్ని నీలా గట్టిగా అరవలేను అనేగా అంతలా అరిచేస్తున్నావు. మీ తాతయ్య బతిక ఉంటేనా..."

"ఏం? ఇంతకంటే ఎక్కువ అరిచేవాడా!?"

"నిన్ను నోరెత్తకుండా చేసి చెవులు పట్టి మరీ పెళ్లి కాస్తా కానిచ్చేవాడు."

"అబ్బ ఆశ, దోశ, నీ సాధింపులు గుర్తుకొచ్చి ఇలాగే హాయిగా నూరేళ్లూ ఉండరా మనవడా! 'పెళ్లొద్దు-లొల్లొద్దు' అంటూ దీవెనొకటి విసిరేవాడేమో?" అభినయిస్తూ అన్నాడు గోపాలం.

మక్కగడక, ఉల్లికారం ఒంటికి పట్టిన గట్టి మనిషాయే! ఉడికిపోనూ లేదు. అతగాడి మాటలకి బామ్మ ఉరిమురిమి చూడనూలేదు. పైగా సీను పెంచదలుచుకోలేదు.

అందుకే అంది "బెండ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికి రావంటారు. ఈ ఏడాది ఎలాగైనా ఏదో పిల్లను చూసి నీ మెడలు వంచి మరీ మీ నాన్న పెళ్లి కానిచ్చేస్తానన్నాడు.ఆ ఖర్మ పట్టకుండా నా మాట విని, మొన్నొచ్చిన ఆ కరీంనగర్ సంబంధం చూసి ఖాయం చేస్కోరాదురా! నీ పెళ్లి కాస్త చూసి ఈ ముసలి ప్రాణం కొండెక్కాలని చూస్తోంది. తొందరగా ఆ ముచ్చట కానిస్తే హాయిగా కళ్లు మూస్తాను. ఏమంటావురా గోప్స్".

'ఉద్యోగం వచ్చేంతవరకు పెళ్లి సీను కట్' అని అంటే నోర్మూసుకున్నారంతా.

చచ్చీ చెడీ ఉద్యోగం రానే వచ్చింది. అదిగో అప్పటి నుంచి మళ్లీ యాజిటేజ్ ఇంట్లోవాళ్ల కోరస్ పాట స్టార్ట్. ఎలాగోలా రెండేళ్లు నెట్టకొచ్చేశాడు. ఇప్పుడు ఊరుకునేలా లేరు.

అందుకే "సరేలేవే బామ్మా! నిన్నీలాగే మనశ్శాంతిగానో, మరోశాంతిగానో చావనిస్తాను. కానీ నాదో చిన్న కోరికా..." అంటూ ఆగాడు.

ఇన్నాళ్లు ఎంత పోరినా, అందరు కలిసి చెవిలో దూరినా, టాట్ వీల్లేదని తెగేసి చెప్పేసినవాడు ఇలా హఠాత్తుగా ఒప్పేసుకోవడంతో "కలకానీ కనడం లేదు కదా!" అంటూ గిల్లి చూసింది బామ్మ, తనని కాదు మనవడ్ని.

"కెవ్వ్..." మంటూ అంతెత్తున అరిచాడతను.

అతనలా శ్రవణానందకరంగా అరవడంతో 'నిజమే! కల కాదిది' అనుకుంటూ "చెప్పరా మనవడా, ఏమి నీ కోరిక" అనడిగింది పాతాళభైరవి టైపులో.

"కాస్త టైమ్ ఇవ్వండి." అన్నాడు మెల్లిగా.

"విషం వద్దా?!" వెటకారంగా అంది.

ఏమనుకుందో ఏమో, "సర్సరే! రెణ్ణెల్ల గడువు తీసుకో. ఆ తర్వాత క్షణం కూడా ఆగేదిలేదు." అంది.

"యాహూ..." అని వెర్రికేక విసరబోయి ఎప్పుడు వచ్చాడో ఎదురుగా నిలబడి తనవంకే గుర్రుగా చూస్తున్న టైగర్‌ని చూసి చప్పున తలొంచుకుని వినయంగా బయటికి వెళ్లిపోయాడు.

* * *

హుటాహుటిన వెళ్లి తన జిగిరీదోస్త్ శ్రీనుని కలిసి "ఒరేయ్! నేను అర్జంటుగా ప్రేమించాల్రా!" అన్నాడు సీరియస్‌గా.

"ఓ యస్. ఇంతకీ ఎవర్ని?" అంతకంటే సీరియస్‌గా అడిగాడు శీను.

"మీ నానమ్మని."

"బావుండదేమోరా."

దోస్త్ కేసి కొరకొరా చూస్తూ. "ఒరేయ్!" అనరచి మీది మీదికి ఉరికి కొట్టబోయాడు.

తప్పించుకొంటూ "సర్సరే అర్థమైంది. లవ్వు స్కీమ్‌ల వారీనా?" అనడిగాడు.

"నో స్కీమ్స్!టోకున లవ్వాడ్డమే! లేదంటే ఇంట్లోనాకు తాడు బిగించేట్టున్నారు".

"సరే! ఓ పని చేద్దాం. ధర్మపురిలో 'ప్రణయ చైతన్యానంద స్వామీజీ' ఉన్నారు. ఇలాంటి వాటిలో స్పెషలిస్ట్. ఆయనో తాయెత్తు కడితే చాలు... ఏ అమ్మాయైనా లవ్వులవ్వంటూ నీ వెంట వద్దన్నా పడాల్సిందే!"

"అలాగా! అయితే తక్షణం ఆయన్ని కలుద్దాం" అదుర్దాగా అన్నాడు.

"సరేపద." అంటూ గోపాలాన్ని లాక్కెళ్ళి మూడొందల చిలుమొదిలించి మరీ ఆ స్వామి దగ్గర 'తాయెత్తు' కట్టించాడు.

ఇంకేం అప్పటినుంచి ఎతగాడి నడక తీరు మారింది. ఛాతీ పొంగింది. అద్దం, దువ్వెన, పౌడర్ అంటిపెట్టుకునే ఉంటున్నాయి. లవ్వాడ్డం ఆ తర్వాత పెళ్ళాడ్డమే అనుకొంటున్నాడు. ఆడపిల్ల కనిపిస్తే చాలు మెలికలు తిరిగిపోతున్నాడు.

ఓ శుభముహూర్తాన ఉమన్స్ డిగ్రీ కాలేజీ ముందు ఫోజేసి యమహుషారుగా నిలబడ్డాడు గోపాలం. వురఫ్ ప్రేమికుడు.

ఈ కాలేజ్ జగిత్యాలకు 5 కి.మీ.ల దూరంలో ఉంటుంది. కాబట్టి ఎవరు వెళ్లాల్సొచ్చినా పనిగట్టుకు వెళ్ళాల్సిందే! ఎవరైనా కుర్రాళ్ళు వెళ్ళినా ప్రత్యేకత తెలుస్తుంది. 'బీటు' ఫీటుకే వచ్చారని. అత్తెలీదు పాపం మన హీరోగారికి.

కాలేజీల్లో మొదలైన లవ్వులు పార్కులూ, సినిమాలూ, షికార్ల దాకా వెళ్ళి అట్నుంచటు మ్యారేజీ గ్యారేజ్‌లో పడడం ఎన్ని సినిమాల్లో చూళ్ళేదు. అదీ అతగాడి ధీమా...!

కాలేజీ గ్రౌండ్‌లో అశోకా చెట్ల నీడన ఓ మెరుపుతీగ తళుకు లీనుతూ నిలబడి ఉంది ఒంటరిగా. ఆమె మీద పడిందతని దృష్టి.

ఆమె వంక లవ్లీగా చూశాడు. ఆమె కూడా అదోల చూసింది. చూపులు చూపులు కలిశాయి. టన్నులకొద్దీ సిగ్గులొలక బోస్తోందామె. ఇంతఫాస్ట్‌గా ఆ అమ్మాయి లవ్వులో పడ్తుందని అతనూహించలేదు. అంతా ఆ తాయెత్తు మహత్యమని బిలియన్లకొద్దీ ఆనందపడ్డాడు మనవాడు. హుషారు కిక్కెక్కడంతో నెమ్మదిగా ఆ బ్యూటీ చెంతవాలి, "హలో!" ... పలకరించాడు.

"సేమ్‌టూ యూ!" అంది తేనె లొలుకే కంఠ స్వరంతో.

"మీ వాయిస్ బావుంది." మెచ్చుకున్నాడు.

"ఏం మీరు మాత్రం ... స్టయిల్‌గా నాగార్జునలాలేరూ!?" అంది.

గోపాలం ఛాతీ అన్నపూర్ణ వారి పిండితో చేసిన గోధుమ రొట్టెలా ఉప్పొంగింది.

"థా... థాంక్స్..." అన్నాడు క్రాఫ్ సరిచేసుకుంటూ.

తాయెత్తు... తాయెత్తు మహిమనుకుంటూ... "ఐ...ఐ.. లవ్‌యూ...!" అని వినబడేసరికి ఆశ్చర్యపోతూ "మరి?" అనడిగాడు.

"నా క్లాస్‌మేట్ అఖిల్ విహారీ రాజ్‌ని. ఇఫ్‌యూ డోంట్ మైండ్ ఈ లవ్ లెటర్‌ని అదిగోండి ఆ వేపచెట్టు కింద నిలబడి ఉన్న స్మార్ట్‌గై కిస్తారా? హీఈజ్ అఖిల్. ఇందాకట్నుండి ఎలా ఇవ్వాలా అని బుర్ర చించుకోకముందే లక్కీగా మీరు తగిలారు..." అంటూ చెబుతోంది.

ఆపై మాటలేమీ అతనికి వినపడడంలేదిక. కళ్ళు బైర్లు కమ్ముతుంటే తూలలేక -నిలవలేక... చివరికి శ్యామ్‌సే బ్రదర్స్ సినిమాల్లోని హర్రర్ పాత్రలా సర్రున అదృశ్యమై పోయాడక్కడి నుంచి.

ఈ కాలేజీలు... గీలేజీలు నయిచల్తా... రైల్వే స్టేషనో, బస్ స్టేషనో పక్కా అనుకొన్నాడు. రైల్వే స్టేషన్ ఊళ్ళో లేదు గనక మరుసటి రోజు బస్ స్టేషన్ సెలెక్ట్ చేసుకొన్నాడు. ట్రిమ్‌గా తయారై నిలబడ్డాడక్కడకి వచ్చిపోయే జనాల్ని చూస్తూ.

అప్పుడొచ్చిందో పాతికేళ్ళ పడుచు చేతిలో బ్రీఫ్‌కేస్‌తోవయ్యారంగా నడచుకొంటూ. కళ్ళు చెదిరే కాకపోయినా కళ్ళు తిప్పని అందం ఆమెది. క్రాఫ్ సరిచేసుకొన్నాడు. టక్ చెక్ చేసుకొన్నాడు. కర్చీఫ్ తీసి ముఖాన్నోసారి రుద్దు... పౌడర్ అద్దుకొన్నాడు. చూపుల బాణాలు వదుల్దామని రెడీ అయ్యాడు.

ముందుగా ఆమెనే మూవ్ అయ్యింది. ఓ రంగుల హరివిల్లు విరిసినట్టు అందంగా నవ్వింది. తనూ నవ్వాడు "హి.. హి.." అంటూ.

తన అందం మీద బోల్డంత కాన్ఫిడెన్స్ అతనికి ఐశ్వర్యరాయ్ అయితే గొప్పా! ఆవిడ సైతం ఆగి తన హాండ్‌సమ్ ఫిగర్‌ని కళ్ళార్పకుండా చూసి వెళ్ళాల్సిందే ననుకొంటాడు. అది ఆత్మవిశ్వాసమో మరి అధిక నమ్మకమో అతగాడికే తెలియాలి.

"ఎ.. ఎ.. ఎందాక వెళ్తున్నారండీ?" తడబడ్తూ చొరవగా అడిగాడు.

"ప్రస్తుతానికి ఇందాక వచ్చానండీ!" అంది. కోయిల తొలిసారిగా గొంతెత్తి కూసినట్టు మధురంగా విన్పించిందతనకి.

"వెరీ ఫన్నీ! హ్యూమరస్ పాలెక్కువనుకుంటా." అన్నాడు.

పడీపడీ నవ్వబోయి బావుండదని పళ్ళికలించడంతో సరిపెట్టుకొంటూ.

"అవునండీ. అన్నీ ఎక్కువే!" అంది కాస్తంత వొయ్యారాన్ని వొలికిస్తూ, చూపుల్లో కైపుని చిలికిస్తూ.

అప్పుడు తుళ్ళిపడ్డాడు. ఆమె వాలకం అతనిలో అనుమానాన్ని రేకెత్తించడంతో..

"మరి మీరెటు?" అనడిగింది తనే తిరిగి. ఏదో ఒకటి చెప్పబోతే బావుండదు.

"కోరుట్ల దాకా" అన్నాడు.

"నేనూ వస్తానండి మీతో! మా ఆయనతో తెగతెంపులు చేసుకొచ్చాను. విడాకులు తీసుకున్నాము. లక్కీగా మీరు తగిలారు." అంది.

ఏవంటాడిక హీరో! మంత్రం వేసినట్టు మాయమయ్యాడక్కడి నుంచి.

'తాయెత్తుగానీ పన్చేయడం లేదా?' అన్న చిన్న డౌటొచ్చిందతనికి. అయినా పూర్తి నిర్ధారణకు మాత్రం రాలేదు. పట్టు వదలని ఫెవికాల్‌లా ఈసారి పాత బస్‌స్టాండ్ వదిలేసి కొత్త బస్టాండ్ సెలక్ట్ చేసుకొని అడ్డా బిడాయించాడు.

అప్పుడొచ్చిందో పాతికేళ్ళ పడుచు చేతిలో బ్రీఫ్‌కేస్‌తోవయ్యారంగా నడచుకొంటూ. కళ్ళు చెదిరే కాకపోయినా కళ్ళు తిప్పని అందం ఆమెది. క్రాఫ్ సరిచేసుకొన్నాడు. టక్ చెక్ చేసుకొన్నాడు. కర్చీఫ్ తీసి ముఖాన్నోసారి రుద్దు... సారీ అద్దుకొన్నాడు. చూపుల బాణాలు వదుల్దామని రెడీ అయ్యాడు.

ముందుగా ఆమెనే మూవ్ అయ్యింది. ఓ రంగుల హరివిల్లు విరిసినట్టు అందంగా నవ్వింది. తనూ నవ్వాడు "హి.. హి.." అంటూ.

అతని అందం మీద బోల్డంత కాన్ఫిడెన్స్ అతనికి ఐశ్వర్యరాయ్ అయితే గొప్పా! ఆవిడ సైతం ఆగి తన హాండ్‌సమ్ ఫిగర్‌ని కళ్ళార్పకుండా చూసి వెళ్ళాల్సిందే ననుకొంటాడు. అది ఆత్మవిశ్వాసమో మరి అధిక నమ్మకమో అతగాడికే తెలియాలి.

"ఎ.. ఎ.. ఎందాక వెళ్తున్నారండీ?" తడబడ్తూ చొరవగా అడిగాడు.

"ప్రస్తుతానికి ఇందాక వచ్చానండీ!" అంది. కోయిల తొలిసారిగా గొంతెత్తి కూసినట్టు మధురంగా విన్పించిందతనకి.

"వెరీ ఫన్నీ! హ్యూమరస్ పాలెక్కువనుకుంటా." అన్నాడు పడీపడీ నవ్వబోయి బావుండదని పళ్ళికలించడంతో సరిపెట్టుకొంటూ.

"అవునండీ. అన్నీ ఎక్కువే!" అంది కాస్తంత వొయ్యారాన్ని వొలికిస్తూ, చూపుల్లో కైపుని చిలికిస్తూ.

అప్పుడు తుళ్ళిపడ్డాడు. ఆమె వాలకం అతనిలో అనుమానాన్ని రేకెత్తించడంతో..

"మరి మీరెటు?" అనడిగింది తనే తిరిగి. ఏదో ఒకటి చెప్పబోతే బావుండదని.

"కోరుట్ల దాకా" అన్నాడు.

"నేనూ వస్తానండి మీతో! మా ఆయనతో తెగతెంపులు చేసుకొచ్చాను. విడాకులు తీసుకున్నాము. లక్కీగా మీరు తగిలారు." అంది.

ఏవంటాడిక హీరో! మంత్రం వేసినట్టు మాయమయ్యాడక్కడి నుంచి.

'తాయెత్తుగానీ పన్చేయడం లేదా?' అన్న చిన్న డౌటొచ్చిందతనికి. అయినా పూర్తి నిర్ధారణకు మాత్రం రాలేదు. పట్టు వదలని ఫెవికాల్‌లా ఈసారి పాత బస్‌స్టాండ్ వదిలేసి కొత్త బస్టాండ్ సెలక్ట్ చేసుకొని అడ్డా బిడాయించాడు.

వంటరిగా నిలబడి అటూ ఇటూ కంగారు కంగారుగా చూస్తున్న ఓ అమ్మాయి దగ్గరికెళ్ళి "ధర్మం చేయండమ్మా!" అనర్థించాడు బెరుకు వదిలి. ట్రై చేద్దాం ఈ టైపులో...అని!

"చిల్లర్లేదు ఫో!" విసుక్కుందామే.

"అయ్యో! నేను బెగ్గర్నే. కానీ ధర్మం చేయమంది డబ్బుల్ని కాదు సుందరీ!"

"మరేవిటి సుందరా!" అదే బాణీలో బదులిచ్చింది.

"నేను ప్రేమ బిచ్చగాణ్ణి. అడుగుతోంది... ప్రేమని!"

"అలాగా! అయితే ఖాళీలేదు ఫో!" అందెప్పట్లాగే.

"అరే... ఖాళీగానే ఉందిగా... భామా!"

"క్కాదు. క్కాదు. నా హృదయం ఖాళీలేనే లేదు." అంది ఒత్తుల్ని ఒత్తి పలుకుతూ.

"ఆ....??"

"అవును. ఆల్రెడీ నేను లవ్వులో పడ్డాను. యూ ఆర్ టూ లేట్.. సారీ!" అంటూ అప్పుడే బైకు మీద వచ్చిన ఓ స్మార్ట్‌గై వెనకాల స్టయిల్‌గా కూచొని నవ్వుతూ రివ్వున నిష్క్రమించిందా సుందరి.

కళ్ళు బైర్లు కమ్మి తూలి దబ్బున కిందపడ్డాడు మన కథానాయకుడు.. రోడ్డు మీద కాదు... నేల మీద... మంచం మీది నుంచి. చప్పున మెలకువయ్యింది.

'అయితే ఈ చివ్వరి సీను డ్రీమా! వామ్మో!' బావురుమన్నాడు. ప్రపంచంలోని కుర్రకారంతా లవ్వులో పడింది.... తను తప్ప అని వాపోయాడు.

ప్రేమంటే కుదిరేట్లు లేదు. లవ్వుగివ్వు నయిజాన్తా! ప్రేమకో నమస్కారం అని మనసులో గట్టి నిర్ణయం ఒకటి తీసుకున్నాడు.

గిసోంటి ప్రేమ కలలకు ముగింపేటుంటుందనుకోకుండ్రి.

ఉంది!

బుద్ధిగా బామ్మ చూపెట్టిన సంబంధం చూసేసుకొని ఒప్పేసుకొన్నాడు. 'పెళ్ళాడి లవ్వాడు' అనే తన స్లోగన్‌కి తనే టర్నింగిచ్చుకొని-ఈ తన ప్రేమ వెర్రికాదు. పసందైన ముగింపని తలంచాడు.

ఆ తర్వాత తాయెత్తిచ్చిన స్వామీజీ విషయం తేల్చాలనుకున్నాడు.

**(13.12.1998)**

❖